

గార్ల: గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో అంబరీష, పాల్గొన్న వైద్యసిబ్బంది

## విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీష
- ముల్కనూర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

గార్ల, డిసెంబర్ 15: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీష హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, స్థానికంగా ఉండి వైద్య సేవలు అందించాలనారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులను సస్పెండ్ చేస్తామన్నారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి, సూపర్ వైజర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం

డోర్నకల్, డిసెంబర్ 15: ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం అందుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సద్విజ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో 20 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానలో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వీరబాబు, సూపర్‌వైజర్ వెంకన్న, సిబ్బంది అరుణ్ పాల్గొన్నారు.



డోర్నకల్: న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న వైద్యాధికారిణి సద్విజ

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

నెల్లికుదురు, డిసెంబర్ 15: విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బయట వేరే పనుల్లో ఉండొద్దని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జీవన్ కుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సీఆర్పీ బొడ్డు వీరస్వామి నిర్వహిస్తున్న బడి బయట పిల్లల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో బడీడు పిల్లలు 6 నుంచి 10 ఏళ్లలోపు పిల్లలు ఎవ్వరూ బాల కార్మికులుగా ఉండకుండా చూడాలన్నారు. బడుల్లో చేరి విద్యనభ్యసించాలన్నారు. అందుకోసం బడి బయట ఎంతమంది పిల్లలు ఉన్నారనే దానిపై విద్యాశాఖ సర్వే నిర్వహిస్తున్నదని తెలిపారు. బడి బయట పిల్లలను గుర్తించి అవగాహన కల్పించి సీఆర్పీలు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని తెలిపారు. ఈ సర్వే జనవరి 11 వరకు కొనసాగుతుందని, ప్రతి సీఆర్పీ తన కాంప్లెక్స్ పరిధిలోని అన్ని తండాలు, గ్రామాల్లో సర్వే చేస్తారని తెలిపారు.

### ప్రతి విద్యార్థిని పాఠశాలకు పంపించాలి

కేసముద్రం: 5 సంవత్సరాలు పైబడిన పిల్లలను బడికి పంపించాలని సీఆర్పీ ఉదయ్ అన్నారు. మండలంలోని కల్వల గ్రామ శివారు తండాలో బడిబయట పిల్లల వివరాలను శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని, తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. తండాల్లో ఎవరూ లేకపోవడంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, తదితరులు ఉన్నారు.



నెల్లికుదురు: రత్తిరాంతండాలో బడి బయట పిల్లల సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ వీరస్వామి

# ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలు కల్పించాలి
- కమలేశ్‌చంద్ర కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేయాలి
- గ్రామీణ తపాలా ఉద్యోగులు
- జిల్లాలోని సబ్ పోస్టాఫీస్‌ల వద్ద కొనసాగుతున్న నిరవధిక సమ్మె





కేసముద్రం: వినతిపత్రం అందిస్తున్న తపాలా ఉద్యోగులు

కేసముద్రం, డిసెంబర్15: గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేసి సమాన వేతనం అందించాలని సీనియర్ బీపీఎం పింగిళి మల్లయ్య అన్నారు. దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సబ్‌బ్రాంచ్ పోస్ట్ మేనేజర్ ధరావత్ రాములుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కలిగించాలన్నారు. కమలేశ్‌చంద్ర కమిటీ సానుకూల సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులతో సమానంగా గ్రాడ్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచాలన్నారు. కమీషన్ పద్ధతిని రద్దుచేసి బ్రాంచి పోస్ట్ మాస్టర్లు చేసే ప్రతి పనిని వర్క్‌లోకి తీసుకోవాలని, బిజినెస్ టార్గెట్ల పేరుతో వేధించే అన్ని పద్ధతులను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు శ్రీనివాసచార్యులు, మాధవి, ఎండీ యూసఫ్, సుమన్, సుధాకర్, జనార్దన్, తరుణ్, మొయినుద్దీన్, రాజేశ్, పీ సుల్తానా, యాకూబ్‌పాషా, కమల్, భార్గవ్‌సాయి, అమీర్‌పాషా, రవికాంత్ పాల్గొన్నారు.



దంతాలపల్లి: నిరసన చేస్తున్న సిబ్బంది



గార్ల: సమ్మెకు మద్దతు తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

### గిరిజన సంఘం నాయకుల మద్దతు

గార్ల: గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమ్మె నాలుగో రోజూ కొనసాగింది. శుక్రవారం వారి సమ్మెకు గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు భూక్యా హరినాయక్, మాంత్ శాంతి కుమార్, పూల్‌సింగ్, లకావత్ శ్రీను, వీరన్న పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

దంతాలపల్లి, డిసెంబర్ 15: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉమేశ్, మధు, వెంకన్న పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

నర్సింహులపేట, డిసెంబర్ 15: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు పరిశ్రమను తక్షణమే ప్రారంభించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. స్థానికంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాల తోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5.50లక్షలు ఇవ్వాలన్నారు. పెన్షన్ రూ.4వేలు తక్షణమే ఇవ్వాలని రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తూ కొత్త రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికో జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రారంభిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలన్నారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో ఖాళీగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయులను నియమించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని, లేకపోతే ఆందోళన, పోరాటాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అలవాల వీరన్న, సోమిరెడ్డి, యాకూబ్, కాయిత వీరయ్య, కేవీపీఎస్ జిల్లా సహకార్యదర్శి మండుల యాకూబ్, నాయకులు యాదగిరి, వెంకన్న, రామేశ్వరం, లింగయ్య, సుధాకర్, రామాచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవిబాబు

## బాల వైజ్ఞానిక ప్రదర్శనలో బయ్యారం ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

బయ్యారం, డిసెంబర్ 15: బాల వైజ్ఞానిక ప్రదర్శనలో బయ్యారం ఏకలవ్య విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈనెల 12న 51వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన-2024 నిర్వహించగా, 'కంప్యూటేషనల్ థింకింగ్ మ్యాథమేటిక్స్' విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు అశ్విని, తేజశ్రీ పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్ గీత, గణిత అధ్యాపకురాలు లావణ్య శుక్రవారం అభినందించారు.



యంత్రాన్ని అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

## వీరభద్రస్వామి ఆలయానికి నోట్ల లెక్కింపు యంత్రం బహూకరణ

కురవి, డిసెంబర్ 15: మండలంలోని వీరభద్రస్వామి ఆలయానికి విజయవాడకు చెందిన భక్తుడు ఉమామహేశ్వరావు నోట్ల లెక్కింపు యంత్రాన్ని బహూకరించారు. శుక్రవారం వారి ఆలయ ఈవో సత్యనారాయణకు యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత ఉమామహేశ్వరావును ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అభినందించారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సన్మానం

గార్ల, డిసెంబర్ 15: అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను గార్ల పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు యడ్ల శ్రీరామ్ యాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



స్పీకర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న శ్రీరామ్‌యాదవ్